క్లుప్తంగా

సృజనాత్మకతను వెలికి తీయాలి


నమూనాలు పరిశీలిస్తున్న అధికారులు

సోమందేపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి వెలికి తీయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక విజ్ఞాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఉత్తమ నమూనాలు తయారు చేసిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు రమాకాంత్‌రెడ్డి, కరస్పాండెంట్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

అగళి: వ్యవసాయ పనుల నిమిత్తం బ్యాంకులో రుణం తీసుకొని సకాలంలో చెల్లించని రైతులకు ఓటీఎస్ అవకాశం కల్పిస్తున్నట్లు కర్ణాటక బ్యాంక్ మేనేజర్ హరికిషోర్ తెలిపారు. రెండు సార్లు రెన్యూవల్ చేసుకోని రైతులు 50 శాతం డబ్బులు చెల్లిస్తే రుణాలను మాఫీ చేస్తామన్నారు. ఈనెల 25వ తేదీలోపల ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీకి రూ.4.15 లక్షల ఆదాయం

మడకశిర: అమరాపురం మండలంలోని హేమావతి సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా ఆర్టీసీకి రూ.4.15 లక్షల ఆదాయం వచ్చినట్లు మడకశిర ఆర్టీసీ డీఎం రామసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిగుండ మహోత్సవం రోజు రూ.3.45 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అలాగే సోమవారం బ్రహ్మరథోత్సవం రోజు రూ.70 వేల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆర్టీసీకి రూ.4.15 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

మడకశిరలో ట్రైనీ డీఎస్పీ శిక్షణ


ట్రైనీ డీఎస్పీ ఉదయపావని

మడకశిర: మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ డీఎస్పీ ఉదయపావని మంగళవారం నుంచి శిక్షణ ప్రారంభించారు. పోలీస్ విధులు తదితర అంశాలపై శిక్షణ పొందనున్నారు. శిక్షణలో భాగంగా పీఎస్‌లోని వివిధ రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను కూడా ఆరా తీశారు.

విద్యార్థుల శ్రమదానం

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం శ్రమదానం నిర్వహించారు. కియా లైబ్రరీ, కళాశాల ఆవరణంలో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు తొలగించి చెట్లకు నీరు పోశారు. ప్రిన్సిపాల్ కేశవరావు విద్యార్థులను అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


గుడిబండ: మండల పరిధిలోని హిరేతుర్పి గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్న నలుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. వారి వద్ద నుంచి రూ.51,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు నిందుతులపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఏఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి


మహిళా పోలీసులతో మాట్లాడుతున్న సీఐ రాజ్‌కుమార్

రొళ్ల: గ్రామాల్లో మహిళా కానిస్టేబుళ్లు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని మడకశిరరూరల్ సీఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ వీరాంజినేయులతో కలిసి మహిళ కానిస్టేబుళ్లతో శాంతి భద్రతలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్ పలు సూచనలు, సలహాలిచ్చారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అగళి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళ భద్రత - హక్కుల సాధికారిత తదితర అంశాలపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించామని ఎస్ఐ వీరేష్ తెలిపారు.

మూగ జీవాలతో చీకటి దందా

మూగ జీవాలతో చీకటి దందా చేస్తున్నారు కొందరు అక్రమార్కులు. హిందూపురం కేంద్రంగా గుట్టుగా సాగిపోతున్న ఈ వ్యవహారంపై అటు అధికారులు, ఇటు పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో నిత్యం హిందూపురం పట్టణం నుంచి టన్నుల కొద్దీ పశు మాంసాన్ని బెంగళూరుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



హిందూపురం నుంచి లేపాక్షి వైపు వస్తున్న ఓ బొలెరో వాహనం ఎనిమిది నెలల క్రితం లేపాక్షి సమీపంలో ప్రమాదానికి గురైంది. దీంతో అందులో ఉన్న పశు మాంసం బయట పడింది. లేపాక్షి పోలీసులు తీరా ఆరా తీయగా హిందూపురంలో పశువులను వధించి బెంగళూరుకు పశు మాంసం రవాణా చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది.

హిందూపురంలో పశువులను వధించి బెంగళూరుకు రెండు బొలెరో వాహనాల్లో పశు మాంసాన్ని తరలిస్తుండగా కర్ణాటక రాష్ట్రం దొడ్డబళాపురానికి చెందిన భజరంగ్‌దళ్, హిందూ ధార్మిక సంఘం నాయకులు అడ్డుకున్నారు. రెండు వాహనాలకు నిప్పు పెట్టి మాంసం తరలిస్తున్న వారికి దేహశుద్ధి చేశారు. దొడ్డబళాపురం ప్రధాన రహదారిపై ఏడాది క్రితం జరిగిన ఈ సంఘటన అప్పట్లో సంచలనం రేపింది.

హిందూపురం పట్టణ సమీపంలో పరిగి రోడ్డులో పశువధ చేసే కేంద్రంలో పని చేసే పరిగికి చెందిన ఓ యువకుడు నాలుగు నెలల క్రితం పని మానేస్తున్నానని నిర్వాహకులు చెప్పాడు. రోజూ తాను పశువులను చంపలేనని తేల్చిచెప్పడంతో అతనిపై విచక్షణారహితంగా దాడి చేశారు. చివరకు ఆ బాధితుడి కుటుంబీకులు ఒకటవ పట్టణ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

- హిందూపురం కేంద్రంగా జోరుగా పశు మాంసం వ్యాపారం
- జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పశువుల సేకరణ
- 'పురం'లో వధించి బెంగళూరుకు అక్రమ రవాణా
- మామూళ్ల మత్తులో అధికారులు


బెంగళూరుకు తరలిస్తుండగా పట్టుబడిన పశు మాంసం (ఫైల్)

హిందూపురం

అర్బన్: హిందూపురం కేంద్రంగా పశు మాంసం పెద్ద ఎత్తున కర్ణాటకలోని బెంగళూరుకు తరలిపోతోంది. గోరంట్ల, పరిగి, గుడిబండ, కదిరి ఇలా జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి హిందూపురానికి నిత్యం పశువులను వివిధ వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండా తీసుకొస్తుంటారు. పట్టణంలోని పరిగి రోడ్డులోని ఓ ప్రాంతంలో పశువులను వధిస్తుంటారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి బొలెరో వాహనాల్లో బోర్డర్ దాటిస్తుంటారు. వారంలో మూడు రోజుల పాటు ఇలా పశు మాంసం తరలిపోతూనే ఉంటుంది.

వారానికి రూ.40 లక్షలు

పశువుల మాంసాన్ని తరలించే ముఠా ఎన్నో జాగ్రత్తలను తీసుకొని మరీ తమ వ్యాపారాన్ని సాగిస్తోంది. గౌరీబిదనూరు మీదుగా కొన్ని వాహనాలు, కొడికొండ చెక్‌పోస్టు–బాగేపల్లి మీదుగా మరికొన్ని వాహనాలను అర్ధరాత్రి మొదలు వేకువజాము వరకూ కర్ణాటక రాష్ట్ర రాజధాని తరలిస్తున్నారు. వారంలో రూ.40 లక్షల విలువ జేసే 20 టన్నుల విలువ గల మాంసాన్ని అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ప్రతి వారం 150 పశువులు చొప్పున నెలకు 600 పశువులను వధిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు చెబుతున్నారు.

పట్టుబడినా డబ్బుతో కొడతారు

పశు మాంసం తరలిస్తుండగా పొరబాటున పోలీసులు, ఆర్టీఓ అధికారులకు ఎవరైనా పట్టుబడినా వెను వెంటనే వివిధ పార్టీల నాయకులతో ఫోన్లు చేయిస్తారు. పైగా పెద్ద మొత్తంలో వారికి ముడుపులు చెల్లించి అక్కడి నుంచి యథావిధిగా పశు మాంసాన్ని తరలించేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

హిందూపురం ప్రాంతంలో పశువులను పెద్ద ఎత్తున వధించే విషయం ఇక్కడున్న ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు, పోలీసులకు కూడా తెలిసినా వారు కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఒకటి, రెండు పశు వధ శాలలకు నామమాత్రంగా అనుమతులున్నాయి. పలుమార్లు మున్సిపల్ అధికారులు తనిఖీ చేసి వధ శాలలు మూసివేయించినా మళ్లీ రెండు రోజుల్లోనే అవి తెరుచుకుంటున్నాయి.

పశు మాంసం తరలిస్తే చర్యలు



చట్టపరంగా గోవధ నిషేధం. హిందూపురం శివారులో పశువులను వధించి మాంసాన్ని బెంగళూరుకు తరలిస్తుండటం దారుణం. అక్రమంగా పశువు మాంసాన్ని తరలిస్తూ పట్టుబడితే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటాం.

– కేవీ మహేష్, డీఎస్పీ, హిందూపురం

పరీక్ష కేంద్రం పరిశీలన


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

లేపాక్షి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జరుగుతున్న ఇంటర్ పరీక్షను తహసీల్దార్ సౌజన్యలక్ష్మి మంగళవారం పరిశీలించారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులు, అక్కడ కేటాయించిన పోలీసు బందోబస్తును కూడా పరిశీలించారు. అయితే 265 మంది విద్యార్థులకుగాను 253 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, మిగిలిన 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ బాషా తహసీల్దార్‌కు వివరించారు.

అమరాపురం: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తనిఖీ చేశారు. కేంద్రంలో కల్పిస్తున్న సౌకర్యాలను ఆరా తీశారు. 302 మంది విద్యార్థులకుగాను 11 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని సీఎస్ రామకృష్ణా నాయక్ తెలిపారు.

వేతనాలు చెల్లించాలని నిరసన


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హిందూపురం: శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు హిందూపురం తహసీల్దార్ ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేశారు. గత 11 నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నా ఇంతవరకూ మంజూరు చేయలేదని వాపోయారు. ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులు కార్మికుల వేతనాల సమస్యను సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఇతర సంఘాలను కార్మికులను ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ వీఆర్ రాము, నాగేంద్ర, సోము, మురళి, రామంజి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న మృతురాలి బంధువులు

హిందూపురం టౌన్: వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేశారు. తన భార్య ప్రీతి (25) మృతికి వైద్యులే కారణమని ఆరోపిస్తూ మృతురాలి భర్త హరి, బంధువులు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఛాంబర్ ముందు మంగళవారం నిరసన తెలిపారు. హరి, బంధువులు మాట్లాడుతూ పట్టణంలోని సూరప్ప కట్ట ప్రాంతంలో నివాసముంటున్న తాము రెండో కాన్పుకు ప్రభుత్వ ఆస్పత్రికి ప్రీతిని తీసుకువచ్చామన్నారు. 1వ తేదీన తన భార్యకు వైద్యురాలు సిజేరియన్ చేసి మగ బిడ్డను బయటకు తీశారని చెప్పారు. ఆ సమయంలో గర్భసంచికి కుట్లు సక్రమంగా వేయకపోవడంతో పరిస్థితి విషమించి అనంతపురం తరలించినా ఫలితం లేకపోయిందన్నారు. దీనిపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్నకు వినతిపత్రం అందించారు. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

విద్యార్థులకు అభినందన

రొళ్ల: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 28న జిల్లాస్థాయి వక్తృత్వపు పోటీలను కొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీలో రొళ్ల బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విజయభాస్కర్ ప్రథమ, మోహన్ కుమార్ ద్వితీయ స్థానం సాధించారు. వారితో పాటు రవీంద్రనాథ్‌ఠాగూర్, వినయ్‌కుమార్, హర్షవర్ధన్ ప్రతిభ చూపారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం వారిని అభినందించారు. పాఠశాల చైర్మన్ సుమ, పాఠశాల ఇన్‌చార్జ్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో మహాలక్ష్మి


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద ఉన్న కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తర్వాత భక్తులకు అన్నదానం చేపట్టారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ ఆనంద్‌కుమార్

గుడిబండ: మండల పరిధిలోని నాగేపల్లి గ్రామ సచివాలయాన్ని ఆర్‌డీఓ ఆనంద్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని సిబ్బంది పనితీరు, జరుగుతున్న సర్వేలపై ఆరా తీశారు. అనంతరం పింఛన్ల పంపిణీపై సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సందర్శించి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. మండలంలోని వీరబొమ్మనహళ్లిలో నిర్వహిస్తున్న భూ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మీనరసింహ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షల్లో అవకతవకలు జరగకుండా చూడండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం: త్వరలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ తహసీల్దార్ వెంకటేష్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈరేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగే ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో కొందరు కోఆర్డినేటర్లు, సంబంధిత శాఖ అధికారులు కుమ్మక్కై డబ్బులు తీసుకుని అవతవకులకు పాల్పడేందుకు సిద్ధమయ్యారని తెలిసిందన్నారు. ఇలా చేయడం వల్ల కష్టపడి చదువుకున్న విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. అందువల్ల పకడ్బందీగా పరీక్షలు నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు భగత్ , గణేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కూలి డబ్బులు చెల్లించాలి


మాట్లాడుతున్న లతా గంగాధర్

పావగడ: నరేగా పథకం కింద పనులు చేసిన కూలీలకు రెండు నెలలుగా కూలీ సొమ్ము అందించలేదని, వెంటనే కూలీల ఖాతాలకు కూలి డబ్బులు పడేలా చర్యలు చేపట్టాలని తాలూకా కూలీ కార్మికుల సంఘటన నాయకురాలు లతా గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం మంగళవాడ గ్రామంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వివిధ గ్రామాల్లో సుమారు 500 మందికిపైగా పనులు చేసినా కూలి డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు.

ఘనంగా ఆశా డే


మాట్లాడుతూన్న డాక్టర్ శివానంద

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శివానంద ఆధ్వర్యంలో మంగళవారం ఆశ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివానంద మాట్లాడుతూ.. కౌమారదశ బాలికల ఆరోగ్యం, పోషణ, హక్కులు, లింగ వివక్ష తదితర విషయాలను వివరించారు. ఆశావర్కర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి సూచించారు. ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ రోగాల కట్టడికి చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్ఎస్ లక్ష్మీదేవి, సూపర్ వైజర్ నర్సారెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణాల పరిశీలన

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురంలో మాజీ మంత్రి రఘువీర కుటుంబ సభ్యులచే నూతనంగా నిర్మిస్తున్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి భవన నిర్మాణాలను మంగళవారం ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైస్ చైర్మన్ డాక్టర్ కె రాజీవ్‌రెడ్డి, డైరెక్టర్ రాజశేఖర్ పరిశీలించారు. అలాగే కంటి పరీక్ష కేంద్రంలో రోజూ ఎంత మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

తప్పుల తడకగా సీనియార్టీ జాబితా

మడకశిర: విద్యాశాఖ అధికారులు ప్రకటించిన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా తప్పుల తడకగా ఉందని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారుతీప్రసాద్, జయకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ జాబితాను సరి చేయాలని కోరారు. విద్యార్హతలు, డిపార్ట్‌మెంట్ టెస్టుల నమోదులో తప్పులు ఉన్నాయన్నారు. సీనియార్టీ నమోదులో కూడా జూనియర్లను సీనియర్లుగా, సీనియర్లను జూనియర్లుగా నమోదు చేశారన్నారు. గతంలో ఇచ్చినట్లు సబ్జెక్టుల వారీగా సీనియార్టీ జాబితా ప్రకటించాలని కోరారు.

వీఎస్ఎస్ఎన్ డైరెక్టర్‌గా లోకేశ్ పాళేగార్

పావగడ: తాలూకాలోని కేటీ హళ్లి గ్రామ వ్యవసాయ సేవ సహకార సంఘం (వీఎస్ఎస్ఎన్) డైరెక్టర్‌గా వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు, జేడీఎస్ మద్దతు దారుడు లోకేశ్ పాళేగార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు జేడీఎస్ మద్దతుదారులు నాగవేణి, వరలక్ష్మి, ముద్దయ్య, రంగస్వామి, నాన్ బారోయింగ్ క్షేత్రం నుంచి నాగరాజ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సంఘంలో మొత్తం 12 డైరెక్టర్ల స్థానాలుండగా ఆరుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇతర 6 డైరెక్టర్ల స్థానాలకు ఈ నెల 9 న ఎన్నికలు జరుగ నున్నాయి.

నిబంధనలు పాటించాలి

రొళ్ల: మండల వ్యాప్తంగా వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్ఐ వీరాంజినేయులు తెలిపారు. రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే భారీ మొత్తంలో జరిమానా విధించడం ఖాయమని హెచ్చరించారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలని తెలిపారు.

పేదలకు అన్నదానం

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేరోడ్డులో అన్నదానం నిర్వహించారు. ఎస్ఏ రాజు జ్ఞాపకార్థం ఆయన కుమారులు మహేష్, రాజ్యలక్ష్మికుమార్ 11 రోజుల పాటు సేవాకర్తలుగా అన్నదానం చేపట్టారు. అనాథలు, ప్రయాణికుల ఆకలి తీర్చడానికి దాతలు ముందుకు రావడం హర్షణీయమని నిర్వాహకులు సమితి అధ్యక్షులు రవికుమార్ తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించాలని వినతి


డాక్టర్ శ్రీనివాసులకు వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

మడకశిరరూరల్: ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ప్రధాన డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ మంగళవారం గుండుమల పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాసులకు ఆశా వర్కర్లు వినతిపత్రం అందజేశారు. జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి సౌభాగ్య మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం చెల్లించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఆశ కార్యకర్తలకు పని భారాన్ని తగ్గించాలన్నారు. డిమాండ్ల సాధనకై 6న విజయవాడలో నిర్వహించే మహా ధర్నాకు అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

సోమందేపల్లి: రైతులకు ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి విమర్శించారు. రైతు సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భాస్కర్, రాజగోపాల్, లక్ష్మి నారాయణ, రామాంజినేయులు, విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వామికి నిప్పు

మడకశిరరూరల్: మండల పరిధిలోని భీమరాయనపల్లి గ్రామ సమీపంలో రైతు సంజీవప్పకు చెందిన గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. స్థానికులు మంటలను గమనించి ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే సగం వరకు గడ్డివాము కాలిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.25 వేలకు పైగా నష్టం జరిగిందన్నారు.